సాక్షి శ్రీకాకుళం

శనివారం । 15 । ఏప్రిల్ । 2023



బ్యాగుల్లో కుక్కి..ఖాకీలకు చిక్కి

గంజాయి రవాణా చేస్తున్న వారిని శ్రీకాకు ళం పోలీసులు పట్టుకున్నారు. 30 కిలోల సరుకు స్వాధీనం చేసుకున్నారు. - 8లో




స్కూటీ రంగులు మార్చి..

ఇచ్ఛాపురం దొంగ విశాఖలో దొరికాడు. చైన్ స్నాచర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. - 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	41°	25°
ఇచ్ఛాపురం	40°	25°
పలాస	39°	24°
టెక్కలి	41°	23°
పాతపట్నం	40°	25°
నరసన్నపేట	40°	24°
శ్రీకాకుళం	41°	25°



న్యూస్‌రీల్

16న జిల్లా అండర్-23 క్రికెట్ జట్టు ఎంపికలు రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అండర్-23 పురుషుల క్రికెట్ జట్టు ఎంపికలను ఈనెల 16వ తేదీన నిర్వహిస్తున్నట్టు శ్రీకాకుళం జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి ముస్తాక్ మహ్మద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్ క్రీడామైదానం వేదికగా ఆ రోజు ఉదయం 8 గంటలకు ఎంపికలు మొదలవుతాయని చెప్పారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు సెప్టెంబర్ ఒకటి, 2000 తర్వాత జన్మించి ఉండాలని స్పష్టం చేశారు. ఇక్కడ ఎంపికల్లో రాణించి క్రీడాకారులను త్వరలో జరిగే ఏసీఏ అంతర్‌జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌కు పంపిస్తామని చెప్పారు. క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్ తదితర పత్రాలతో హాజరుకావాలన్నారు. అలాగే క్రీడాకారులు తెలుపురంగు యూనిఫారం, షూ విధిగా ధరించి హాజరుకావాలని ముస్తాక్ సూచించారు. మరిన్ని వివరాలకు కోచ్ సుదర్శన్ (9441115396), ఆర్పీ రెడ్డి (8555078215), కె.ఎస్.ఎం. శైలానీ (9246631797) నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



వారోత్సవాలను ప్రారంభిస్తున్న సీతారాములు, వరప్రసాద్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా అగ్నిమాపక సహాయాధికారి ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత, విశ్రాంత అగ్నిమాపకాధికారి గురుగుబిల్లి సీతారాములు జెండా ఊపి ఫైర్ ఇంజిన్‌ను ప్రారంభించారు. అంతకుముందు అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఉపయోగించే పరికరాలు, వేసుకునే జాకెట్లు, తదితర వాటికి సహాయాధికారి వరప్రసాద్, సీతారాములు సెల్యూట్ చేశారు. ఈ సందర్భంగా సహాయాధికారి మాట్లాడుతూ వేసవి కాలం గ్రామీణ ప్రాంతాల్లో వరికుప్పలు అగ్నికి ఆహుతయ్యే ప్రమాదముందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇంటిలో నాణ్యమైన గ్యాస్ పైప్‌లైన్లు వాడాలని, ఆస్పత్రులు, పాఠశాలలు అగ్నిమాపక నియమ నిబంధనలు పాటించాలన్నారు. విశ్రాంత అగ్నిమాపకాధికారి సీతారాములు తన అనుభవాలను ప్రస్తుత సిబ్బందితో పంచుకున్నారు.

నౌపడ పీహెచ్‌సీ సందర్శన



పీహెచ్‌సీ డాక్టర్లతో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ పీహెచ్‌సీని శుక్రవారం డీఎంహెచ్‌ఓ బొడ్డేపల్లి మీనాక్షి సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిసరాలు, ల్యాబ్, ఫార్మసీ, ఆపరేషన్ థియేటర్, నోటీస్ బోర్డులు, ఓపీ నమోదు పరిశీలించారు. అనంతరం సీఎం పర్యటన సందర్భంగా నిర్వహించబోయే మెడికల్ క్యాంపు, వైద్య సేవలపై వైద్యాధికారులు డాక్టర్ ఒ.పరిమల, ఎస్.నందినితో సమీక్షించారు. 108 అంబులెన్స్‌లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఎండలు, ఉక్కబోత కారణంగా ప్రజలు ఇబ్బందులు పడితే చికిత్సకు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే కరోనా నిబంధనలు పాటించాలని తెలియజేశారు. నాలుగు పీహెచ్‌సీ సిబ్బంది సమన్వయంతో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ జి.రాజేశ్వరి, ఎంపీహెచ్ఎస్ మోహన్‌రావు, హెచ్ఎస్ సూర్యకళ, విస్తరణాధికారి ఎం.గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

• నిత్య స్ఫూర్తి ప్రదాత.. అందుకో మా జ్యోత

భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయనకు ఊరూవాడా ఘనంగా నివాళులర్పించాయి. ఆ మహనీయుడి ఆశయ సాధనే ఆయనకు ఇచ్చే నివాళి అని ముక్తకంఠంతో అన్నాయి. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని ప్రజా ప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు.



ఆశయాలు ప్రజల్లోకి వెళ్లాలి..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు ప్రజల్లోకి వెళ్లాలి. అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

– ధర్మాన ప్రసాదరావు, రెవెన్యూ మంత్రి

(పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో..)



ఎచ్చెర్ల క్యాంపస్: సంత సీతారాంపురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



పదవులు అంబేడ్కర్ చలవే

అంబేడ్కర్ చరిత్ర పిల్లలందరికీ వివరించాలి. జయంతికి 15 రోజులు ముందుగా జయంత్యుత్సవాలు చేసి పిల్లలకు పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వాలి. ఆయన రచించిన రాజ్యాంగం ద్వారానే సామాజిక పదవులు, రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఆ రిజర్వేషన్ల వల్లే నా లాంటి వారికి పదవులు వచ్చాయి. అంబేడ్కర్ ఆశయ సాధనకు సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారు.

– తమ్మినేని సీతారాం, స్పీకర్

(శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియంలో సాంఘిక సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో..)

ఆశయ సాధనకు కృషి

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయ వేత్తగా, రాజ్యాంగ నిర్మాతగా అంబేడ్కర్ దేశ ప్రజల గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు. – పిరియా విజయ, జెడ్పీ చైర్ పర్సన్

(మండల దళిత సంఘం, బొరివంక దళిత సంఘం ఆధ్వర్యంలో కవిటిలో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో..)



గొప్ప మార్గదర్శకుడు..



ఆధునిక భారతదేశానికి అంబేడ్కర్ మార్గదర్శి. అంబేడ్కర్ అంటేనే జ్ఞానం. ఆయన పంచిన చైతన్యం, ఆయన విశ్వసించిన విలువలు మనందరికీ మార్గదర్శకం. ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలి.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే

(శ్రీకాకుళంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో..)

ధర వచ్చేవరకు దాచుకుందాం..

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం



ఈ ఫొటో చూడండి. పాతపట్నం మండలం ప్రహ్లాదపురం గ్రామ ఉద్యానవన రైతులు తమ పంటలను, ఉత్పత్తులను మార్కెట్‌లో మద్దతు ధర వచ్చే వరకు నిల్వ చేసుకునేందుకు వీలుగా నిర్మించిన కలెక్షన్ సెంటర్ ఇది. రైతులు సంఘంగా ఏర్పడి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీతో నిర్మించుకున్నారు. పండిన పంటకు మంచి ధర పలికితే ఎలాగూ అమ్మేసుకుంటారు. సరైన ధర దక్కనప్పుడు మెరుగైన ధర వచ్చేవరకు పండించిన పంటను కొన్నాళ్లు నిల్వ చేసుకునేలా దీన్ని నిర్మించారు. అక్కడికే హోల్ సేల్ వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసుకునేలా ఏర్పాట్లు కూడా చేశారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న గోడౌన్(కలెక్షన్ సెంటర్) కొత్తూరు మండలం అడ్డంగిలోనిది. దీన్ని కూడా అక్కడ రైతులు సంఘంగా ఏర్పడి, ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీతో నిర్మించుకున్నారు. తమ ఉత్పత్తులకు మద్దతు ధర వచ్చేంతవరకు నిల్వ చేసుకునే సామర్థ్యంతో నిర్మించారు. ఇప్పుడిది రైతులకు చాలా బాగా ఉపయోగపడుతుంది.

- జిల్లాలో కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ రూమ్‌ల ఏర్పాటు
- ఉద్యాన పంటల రైతుల కోసం ప్రభుత్వం చేస్తున్న మేలు
- సంఘాలుగా ఏర్పడిన రైతులకు యూనిట్లు మంజూరు
- యూనిట్‌లతో 75శాతం సబ్సిడీ
- ఇప్పటికే జిల్లాలో 20 కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ రూమ్‌ల నిర్మాణం

ప్రహ్లాదపురం, అడ్డంగితో కలిపి జిల్లాలో ప్రస్తుతం 12 కలెక్షన్ సెంటర్లు, 8 కోల్డ్ రూమ్‌లు ఉన్నాయి. వీటి ద్వారా రైతులు మేలు పొందుతున్నారు. మరో 14 కలెక్షన్ సెంటర్లు, 12 కోల్డ్ రూమ్‌లు నిర్మాణంలో ఉన్నాయి. ఇవన్నీ వినియోగంలోకి వస్తే 26 కలెక్షన్ సెంటర్లు, 20 కోల్డ్ రూమ్‌లు రైతులకు అందుబాటులోకి వస్తాయి. వీటితోనే పరిమితం కాదు. సంఘాలుగా ఏర్పడిన రైతులు ముందుకొస్తే మరో 38సెంటర్లు జిల్లాలో ఏర్పాటు చేసుకునేలా ప్రభుత్వం ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉంది. అందుకు తగ్గ నిధులు కూడా అందుబాటులో ఉన్నాయి.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

జిల్లాలో ఉద్యానవన పంటల సాగు పెరుగుతోంది. ఒకప్పుడు 60వేల నుంచి 70వేల ఎకరాల్లోపు ఉన్న ఉద్యానవన సాగు ఇప్పుడు దాదాపు లక్ష ఎకరాల వరకు చేరింది. అందుకు తగ్గ దిగుబడి కూడా వస్తోంది. ప్రస్తుతం జిల్లాలో 51వేల ఎకరాల్లో జీడి మామిడి సాగవుతుండగా, 32వేల ఎకరాల్లో కొబ్బరి, 5,300ఎకరాల్లో మామిడి, 5,100 ఎకరాల్లో కూరగాయలు, 2 వేల ఎకరాల్లో అరటి, 1600 ఎకరాల్లో ఆయిల్‌పామ్, 1000 ఎకరాల్లో బొప్పాయి, 525 ఎకరాల్లో మునగ, 375 ఎకరాల్లో నేల పనస, 275 ఎకరాల్లో పనస సాగవుతోంది. జిల్లాలో రైతులు చూపిస్తున్న ఆసక్తితో ప్రభుత్వం కూడా సాంకేతిక పరిజ్ఞానం అందిస్తోంది. దీన్ని అందిపుచ్చుకున్న రైతులు మంచి దిగుబడులు సాధిస్తున్నారు.



నిల్వ చేసుకునేందుకు..

దిగుబడి కాస్త అధికంగా ఉండి మద్దతు ధర లేకపోతే రైతులు నష్టపోవాల్సి వస్తోంది. మెరుగైన ధర వచ్చేంత వరకు నిల్వ చేసుకునే వీలు లేక అప్పటికప్పుడు ఎంత ధర వస్తే అంతకు అమ్మేసి సర్దుకుపోతున్నారు. ఈ క్రమంలో నష్టాలు చవిచూస్తున్నారు. కొందరైతే దళారుల బారిన పడి నష్టపోవడమే కాదు మోసపోతున్నారు. ఇలాంటి సమస్యలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానవన రైతుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంది. అగ్రికల్చరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్(ఎఐఎఫ్) నిధులతో కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ రూమ్ లు ఏర్పాటు చేసేందుకు ముందుకువచ్చింది. అయి తే, వాటిని ప్రభుత్వమే నిర్మించి ఇస్తే వాటికి సరైన నిర్వహణ లేక అక్కరకు రాకుండా పోతున్నాయన్న ఉద్దేశంతో రైతులను భాగస్వామ్యం చేసింది. 100 నుంచి 500మంది రైతులతో ఏర్పడిన సంఘాలకు ఆ కలెక్షన్ సెంటర్, కోల్డ్ రూమ్ యూనిట్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. దానిలో సంఘాలుగా ఏర్పడి రైతులకు వాటిని మంజూరు చేస్తూ 75శాతం సబ్సిడీతో రైతుల చేత నిర్మాణం చేయిస్తోంది.

ధరల నిర్ధారణ

- కలెక్షన్ సెంటర్‌కైతే రూ.15లక్షల యూనిట్‌గా నిర్దేశించింది. దాంట్లో రూ.11.25లక్షల మేర(75శాతం) ప్రభుత్వమే సబ్సిడీగా ఇస్తుంది. మిగతా రూ.3.75లక్షలను సంఘంలో ఉన్న రైతులు తమ భాగస్వామ్య వాటాగా పెట్టుకోవాలి.
- కోల్డ్ రూమ్‌కైతే రూ.12.50లక్షల యూనిట్ కాగా అందులో 75శాతం సబ్సిడీ కింద రూ. 9.375లక్షలు ప్రభుత్వం నిధులు ఇవ్వనుంది. మిగతా రూ.3.125లక్షలను సంఘం తమ భాగస్వామ్యంగా సమకూర్చాల్సి ఉంటుంది. కాకపోతే, ముందు నిర్మాణం చేశాకే సబ్సిడీ ఇస్తుంది.
- ఈ లోపు రైతుల దగ్గర సొమ్ము లేకపోతే 90శాతం మేర అంటే కలెక్షన్ సెంటర్‌కు రూ.13.50లక్షల మేర, కోల్డ్ రూమ్‌లకు రూ.11.25లక్షలు బ్యాంకు లోన్ పొందవచ్చు. ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వగానే బ్యాంకు లోన్ తీర్చేయవచ్చు.
- లెంటల్ లెవెల్ వరకు నిర్మాణం జరిగితే యూనిట్‌లో 50శాతం సబ్సిడీ చెల్లించగా, మిగతా 50 శాతం సబ్సిడీ పూర్తయ్యాక ప్రభుత్వం విడుదల చేయనుంది.
- ఆ తర్వాత నిర్వహణ కోసం కలెక్షన్ సెంటర్లలోనూ, కోల్డ్ రూమ్‌లలోనూ పంట నిల్వ చేసుకునే వారి నుంచి నామినల్ ఫీజును ఆ సంఘం వసూలు చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఇది కేవలం నిర్వహణ కోసమే. ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా చెల్లించనక్కర్లేదు.

అవకాశం వినియోగించుకోవాలి



ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలి. మద్దతు ధర దొరకని సమయంలో కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ రూమ్‌లో భద్రంగా పంటలు నిల్వ చేసుకోవచ్చు. మంచి రేటు వచ్చాక అమ్ముకోవచ్చు. 100 నుంచి 500 మంది రైతులు సంఘంగా ఏర్పడి ముందుకొస్తే ప్రభుత్వం 75శాతం సబ్సిడీ ఇస్తూ యూనిట్ మంజూరు చేయనుంది. ఎన్ని సంఘాలకైనా ప్రభుత్వం ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉంది. – ఆర్.వీ.వీ.ప్రసాద్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి.

నిర్మాణాలతో లాభాలు..

- రైతులు తమ పంటను, ఉప ఉత్పత్తులను మార్కెట్‌లో మద్దతు ధర వచ్చేవరకు నిల్వ చేసుకోవచ్చు.
- దళారుల బారినపడకుండా మంచి ధర వచ్చాక విక్రయించుకోవచ్చు.
- హోల్‌సేల్ వ్యాపారులు నేరుగా కలెక్షన్ సెంటర్‌కు, కోల్డ్ రూమ్‌కు వచ్చి పంటలను కొనుగోలు చేసుకోవచ్చు.
- ప్రకృతి వైపరీత్యాలు, విపత్కర పరిస్థితుల్లో నేల రాలిన పంటలను కలెక్షన్ సెంటర్‌లో గ్రేడింగ్ చేసుకుని నిల్వచేసుకుని మార్కెట్ చేసుకోవచ్చు.
- కలెక్షన్ సెంటర్‌లో కోత అనంతరం యాజమాన్యం, పంట శుభ్రపరచడం, ప్రీ కూలింగ్, గ్రేడింగ్, ప్యాకింగ్, బ్రాండింగ్ చేసుకునే అవకాశం ఉండటంతో మార్కెట్‌లో మంచి ధర లభిస్తుంది.

పెద్ద కొడుకులా అండగా ఉంటా..



వృద్ధ మహిళకు రేషన్, దుస్తులు అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సాయిరాజ్

కంచిలి: ఆమె వయసు 60 ఏళ్లు. నా.. అని చెప్పుకోవడానికి ఎవరూ మిగల్లేదు. వివాహం కూడా కాలేదు. ఊరిలో రోజుకొకరు భోజనం పెడుతుంటే కడుపు నింపుకుంటోంది. ఊరిలోని పాడుపడిన ఇంటిలోనే దశాబ్దాలుగా తలదాచుకుంటోంది. కష్టాలు, కన్నీళ్లతోనే ఆమె రోజులు గడుస్తున్నాయి. అలాంటి వృద్ధురాలి వద్దకు నాయకుడు వెళ్లి 'అమ్మా.. నేను నీకు పెద్ద కొడుకు లాంటి వాడిని, నీ బాధ్యత చూసుకుంటాను' అన్నారు. అంతే ఆమె గుండె నీరైపోయింది. అప్పలంటూ ఎవరూ లేని తనపై చూపించిన ప్రేమకు ఆమె కరిగిపోయింది. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో కనిపించిన అపురూప దృశ్యమిది.

కంచిలి మండలం మండపల్లి పంచాయతీ బంజిరి నారాయణపురం గ్రామానికి చెందిన నొళియా టోబ్బి అనే వృద్ధురాలిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ దంపతులు ఆదుకున్నారు. గడపగడపకూ మ న ప్రభుత్వంలో భాగంగా ఆమె ఇంటికి వెళ్లి వృద్ధురాలి పరిస్థితి చూసి చలించిపోయారు. ప్రతి నెలా బియ్యం, రేషన్ అందిస్తామని, పని కి వెళ్లనక్కర్లేదని చెప్పారు. ఈమెకు మూడు పూటలా భోజనం పెట్టాలని స్థానికులకు సూ చించారు. ఆ దంపతులు చూపించిన వాత్సల్యానికి టోబ్బి కన్నీరు పెట్టుకున్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, స్థానిక వైఎస్సార్ సీపీ నేత మాదిన ధనుంజయ ఉన్నారు.

'హార్బర్ నిర్మాణంతో ఉత్తరాంధ్ర ప్రగతి'



బుడగుట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మించనున్న స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సీదిరి, ఎమ్మెల్యే కిరణ్

ఎచ్చెర్ల క్యాంపస్: బుడగుట్లపాలెం తీరంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్ వర్చువల్‌గా ఈ నెల 19న శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. రూ.365 కోట్లతో ఈ హార్బర్‌ను నిర్మించనున్నట్లు చెప్పారు. ఆయన స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌తో కలిసి ఫిషింగ్ హార్బర్ స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ నిర్మాణాలతో ఉత్తరాంధ్ర పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మత్స్యకార గ్రామాలు ఎక్కువగా ఉన్న ఎచ్చెర్ల నియోజక వర్గంలో హార్బర్ వల్ల వలసలు తగ్గుతా యని అన్నారు. ప్రాంతీయ అభివృద్ధితో పాటు, మ త్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగు పడతా యని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ, మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ బల్లాడ హేమమాలినీరెడ్డి, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు కోనాడ నర్సింగరావు, నాయకులు శంకరరావు, నారాయణరావు, జనర్దన రెడ్డి, మూడి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలు

ఇచ్ఛాపురం: శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలు ఈనెల 17 వ తేదీ నుంచి మొదలవుతాయని ఆలయ అభివృద్ధి, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఆలయం ప్రాంగణంలో అమ్మవారి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా వీధుల్లో ఏర్పాటు చేయనున్న మండపాల వివరాలను వెంటనే ఉత్సవ కమిటీ ప్రతినిధులకు తెలియజేయాలని అన్నారు.



సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధిక

సంతబొమ్మాళి: భావనపాడు పోర్టు శంకుస్థాపనలో భాగంగా మూలపేట, నౌపడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధిక, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌లు శుక్రవారం పరిశీలించారు. పర్యటన సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు, వీవీఐపీ వాహనాల పార్కింగ్, హెలీపాడ్, ప్రోటోకాల్ నిర్వహణ తదితర అంశాలపై పోలీసులు, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. విష్ణుచక్రం గ్రామంలో నిర్మితమవుతున్న పైలాన్‌ను పరిశీలించారు. నౌపడలో సభ ప్రాంగణం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ విఠలేశ్వరరావు, డీఎస్పీ శివరాంరెడ్డి, తహసీల్దార్ చలమయ్య తదితరులు పాల్గొన్నారు. రూ.35 కోట్లతో 594 మంది నిర్వాసితులకు 55 ఎకరాల్లో నౌపడలో అధునాతన వసతులు గల ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మించనున్నామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. పరిహారం పంపిణీ 90 శాతం పూర్తయినట్లు చెప్పారు.

క్లుప్తంగా

జిల్లా సీనియర్స్ పురుషుల హాకీ ఎంపికలు రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ పురుషుల హాకీ జట్టు ఎంపికలు ఈ నెల 16న జరగనున్నాయి. శ్రీకాకుళం రూరల్ మండలంలోని పాత్రునివలస క్రీడా మైదానం వేదికగా ఆదివారం ఉదయం 6.30 నుంచి ఈ ఎంపికల ప్రక్రియ ప్రారంభంకానుంది. అదే రోజు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 5–ఏ సైడ్ హాకీ టోర్నమెంట్ పోటీలు కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, 3 పాస్‌ఫొటోలతో హాజరుకావాలని జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు, కార్యదర్శి ఎస్.మధు కోరారు. పూర్తి వివరాలకు 76608 77497 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆశ్రమ విద్యార్థిని ఆదుకోవాలి



విద్యార్థి గోపిని పరామర్శిస్తున్న ఆదివాసీ వికాస పరిషత్ నాయకులు

మందస: మండలంలోని కిల్లోయి ఆశ్రమంలో చదువుతున్న విద్యార్థి టి.గోపిని ఆదుకోవాలని ఆదివాసీ వికాస పరిషత్ నాయకులు కోరారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని శుక్రవారం పరామర్శించి, సంఘటన పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మందసలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం, డిప్యూటీ వార్డెన్, కుక్ నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థి చేయి కాలిపోయి ఇన్‌ఫెక్షన్‌కు గురైందన్నారు. తండ్రి లేకపోవడంతో తల్లి సీత కష్టపడుతూ కుమారుడిని చదివిస్తోందన్నారు. ఐటీడీఏ అధికారులు స్పందించి, గోపి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సవర జగన్, జేఏసీ అధ్యక్షుడు సవర రాంబాబు, రామారావు పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం



రక్తదాతలతో సేవా సమితి సభ్యులు

వజ్రపుకొత్తూరు: యువతరం సేవా సమితి సహకారంతో ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో పూండిలో శుక్రవారం రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. 20 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తం దానం చేశారు. వీరిలో పలాసకు చెందిన మహేంద్ర హోమ్ ఫైనాన్స్ శాఖ ఉద్యోగులు 8 మంది ఉన్నారు. దాతలకు ప్రశంస పత్రాలను అందించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు చింత మురళి, సభ్యులు కె.రాంబాబు, జి.అశోక్, లింగరాజు, నూకరాజు, నారాయణ, బాలరాజు, ఉమాపతి, శిరీష, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కుల పరిరక్షణ బాధ్యత ప్రభుత్వాలదే

శ్రీకాకుళం: ప్రజల హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ అన్నారు. శుక్రవారం శ్రీకాకుళం యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్బంధాలకు వ్యతిరేకంగా పోరాటడం ద్వారానే హక్కులను కాపాడుకోగలమని చెప్పారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో విద్య ఉండడం ద్వారానే సామాజిక న్యాయం అమలవుతుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా కోశాధికారి బి.శ్రీరామమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.ఉమాశంకర్, పి.కార్యదర్శి జి.గిరిధరరావు, సూర్యప్రకాషరావు, జి.సురేష్ పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	59,670–00
బంగారం(22కి. 10గ్రా.)	54,700–00
వెండి (కిలో)	76,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹105	₹165	₹ 185

బ్యాగుల్లో కుక్కి..

ఖాకీలకు చిక్కి!

- 30 కిలోల గంజాయి స్వాధీనం
- ఒడిశా నుంచి విజయవాడకు తరలిస్తున్న ముఠా
- భార్యాభర్తలతో పాటు యువకుడ్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు



గంజాయి ప్యాకెట్లను తూకం వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: ప్రయాణ బ్యాగుల్లో గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులు శుక్రవారం ఉదయం పోలీసులకు పట్టుబడ్డారు. శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పప్పల శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం డేఅండ్ నైట్ కూడలి సమీపంలో టాక్సీస్టాండ్ వద్ద ఓ మహిళ, మరో ఇద్దరు వ్యక్తులు మూడు బ్యాగులు పట్టుకుని అనుమానాస్పదంగా కనిపించడంతో ఎస్‌ఐ కె.వెంకటేష్, పోలీసు సిబ్బంది వెంటనే అదుపులోకి తీసుకున్నారు. బ్యాగులను తనిఖీ చేయగా 15 గంజాయి ప్యాకెట్లు కనిపించాయి. వాటిని తూకం వేయగా 30.3 కిలోలుగా నిర్ధారించారు. వెంటనే వీరిని స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. తమది ఒడిశా రాష్ట్రం గుణుపూర్ దగ్గర బురండి గ్రామమని.. విజయవాడ వెళ్లేందుకు గురువారం ఒడిశా నుంచి ఆర్టీసీ బస్సు లో బయల్దేరి రాత్రి శ్రీకాకుళంలో దిగామని.. ఉదయాన్నే విజయవాడ వెళ్లేందుకు నిర్ణయించుకున్నామని చెప్పారు. పట్టుబడిన నిందితుల్లో ముద్దిక రాజు, ముద్దిక లక్ష్మి భార్యాభర్తలు కాగా మరో యువకుడు అజయ్, వీరివెంట చిన్నారులిద్దరున్నారు.

పట్టుకున్నారిలా..

కొంతకాలంగా నగరంలోని యువత గంజా మత్తుతో తూలుతుండటం, ఒడిశా నుంచే అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం నిఘా వర్గాల ద్వారా పోలీసులకు చేరింది. ఈ నేపథ్యంలో ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు అర్ధరాత్రి తనిఖీల్లో ఒడిశా నుంచి వచ్చే వాహనాలు, బస్సులను కాంప్లెక్సు, టాక్సీ కూడళ్లలో పోలీసులు నిఘా పెట్టడమే కాకుండా ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి రెండో పట్టణ ఎస్‌ఐ కె.వెంకటేష్ రాత్రి గస్తీల్లో భాగంగా ఇదే విధంగా తనిఖీలు జరిపారు. వేకువఝాము నుంచే వీరిపై అనుమానం రావడంతో నిఘా పెట్టారు. ఉదయం వీరు ముగ్గురూ విశాఖపట్నం వెళ్లడానికి బ్యాగులతో సన్నద్ధమవుతున్న సమయంలో ఎస్‌ఐతో పాటు హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు ప్రకాష్, విజయ్, మహిళా కానిస్టేబుల్ సంతోషి మాటువేసి పట్టుకున్నారు. గంజాయిని సీజ్ చేసి నిందితులను అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

అచ్చెన్నా.. అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?



మాట్లాడుతున్న రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్

- రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ సవాల్

కోటబొమ్మాళి: టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడుడి దమ్ముంటే ఎంపీ రామ్మోహన్‌నాయుడితో కలిసి టెక్కలి నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ సవాల్ విసిరారు. శుక్రవారం కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధి జరగడం లేదంటూ స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు పదేపదే ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని, 30 ఏళ్లగా కింజరాపు కుటుంబీకులు పదవుల్లో ఉండి జిల్లాకు గానీ, టెక్కలి నియోజకవర్గానికి గానీ చేసిన అభివృద్ధి ఏమీలేదన్నారు. టీడీపీ హయాంలో సొంత మండలం కోటబొమ్మాళిలోని శ్రీజగన్నాథపురం, వింజాంపాడు, హరిశ్చంద్రపురం, తాటిపర్తి, లఖందిడ్డి, విశ్వనాథపురం, ఎత్తురాళ్లపాడు, దంత, బలరాంపురం గ్రామాలు నిరాదరణకు గురయ్యాయని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాకే రూ.20 కోట్లతో ఆయా గ్రామాల్లో రోడ్లు వేశామన్నారు. ఎంపీ ఉత్సవ విగ్రహంలాంటి నాయకుడని, ఫొటోలకు పోజులివ్వడం తప్ప చేసిందేమీలేదని విమర్శించారు. అవినీతి సొమ్ముతో, రిగ్గింగులు చేసి గెలిచిన వారికి అభివృద్ధి కనిపించదన్నారు. వైఎస్సార్ హయాంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు వంశధార ఫేజ్2 పనులు చేపట్టి రైతులకు రెండో పంటకు అవకాశం కల్పించారని గుర్తు చేశారు. జిల్లావ్యాప్తంగా టీడీపీలో ప్రతి నియోజకవర్గంలోనూ మూడేసి వర్గాలకు ఆజ్యం పోసింది అచ్చెన్నాయుడేనని, లోకేష్‌ని ఓడించేందుకు కూడా తెరవెనుక కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు. వైఎస్సార్ సీపీలో సీటు ఇస్తామంటే అచ్చెన్నాయుడు కూడా పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నాడన్నారు. రానున్న ఎన్నికలే చంద్రబాబుకి చివరివని, తర్వాత పార్టీ మూసేస్తారని అన్నారు. చంద్రబాబు డైరెక్షన్‌లో దొంగ రాజకీయాలు చేస్తున్న పవన్ కల్యాణ్‌కు డిపాజిట్‌లు కూడా రావన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంతో టీడీపీ నాయకుల్లో వణుకు పుట్టిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 స్థానాల్లోనూ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు రోణంకి మల్లయ్య, అన్నెపు రామారావు, పేడాడ వెంకటరావు, నేతింటి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



ఆనందపురంలో పనులు పరిశీలిస్తున్న ఏఈఈ

జి.సిగడాం: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈఈ బగాది భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆనందపురం, ఆబోతులపేట గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటి బోర్లు పాడైతే సమాచారం అందిన 24 గంటల్లోగా బాగు చేస్తామన్నారు. ప్రతి పల్లెకు జల్ జీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు చిత్తిరి మోహన్, పేడాడ శ్రీరామమూర్తి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు..

స్కూటీ రంగులు మార్చి..

గొలుసు దొంగతనాలు

- నిందితుడిని పట్టుకున్న పోలీసులు
- 116.2 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు నగలు

అల్లిపురం: బండి దొంగిలించి.. దాని రంగులు మార్చి.. గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న ఒకరిని క్రైమ్ పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి 116.2 గ్రాముల బంగారు ఆభరణాలు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. విశాఖ సూర్యాబాగ్‌లోని నగర పోలీస్ కమిషనర్ సమావేశ మందిరంలో క్రైమ్ డీసీపీ గంధం నాగన్న ఈ వివరాలు వెల్లడించారు. గతేడాది అక్టోబర్ 5న దసరా పండగ రోజు సాయంత్రం 7 గంటల సమయంలో మురళీనగర్‌కు చెందిన తెలగపూడి పద్మావతి రామాలయం నుంచి తన ఇంటికి వెళుతున్నారు. ఆ సమయంలో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి గ్రామానికి చెందిన దుక్క జయరామ్ స్కూటీపై వచ్చి ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు నల్లపూసల దండను లాక్కొని వెళ్లిపోయాడు. ఈ మేరకు బాధితురాలు కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ ఏడాది మార్చి 21న మురళీనగర్‌కు చెందిన పొన్నాడ అమ్మాజీ బర్మా క్యాంప్ నూకాలమ్మ గుడి నుంచి మురళీనగర్ నడుచుకుని వెళుతున్నారు. పట్టాభిరెడ్డి తోట ప్రాంతంలో నిందితుడు స్కూటీపై వచ్చి ఆమె మెడలో ఆరు తులాల బంగారు పుస్తెలతాడు, నల్లపూసల దండ లాక్కొని వెళ్లిపోయాడు. ఈ మేరకు బాధితురాలు కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో క్రైమ్ డీసీపీ గంధం నాగన్న ఆదేశాలతో క్రైమ్ ఏడీసీపీ డి.గంగాధరం, క్రైమ్ ఏసీపీ ఎ.వెంకటరావు ఉత్తర్వుల మేరకు వెస్ట్ క్రైమ్ సీఐ కె.దుర్గాప్రసాదరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎన్.సునీల్ సారథ్యంలో రెండు బృందాలు ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని గురువారం కొలాసపురం ప్రాంతంలో అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి దొంగిలించిన సొత్తు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు.

అప్పుల బాధ తట్టుకోలేక..

నిందితుడు దుక్కా జయరామ్ కుమారుడు అనారోగ్యం, అప్పుల బాధల నుంచి విముక్తి పొందేందుకు చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో బంగారు ఆభరణాలు దొంగతనం చేయాలని నగరానికి వచ్చాడు. కంచరపాలెం పరిధిలో రెండు, గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, ఒక స్కూటీ దొంగతనం చేశాడు. ముందుగా స్కూటీ దొంగతనం చేసి.. చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. తర్వాత స్కూటీ రంగు, నంబర్ ప్లేట్ మార్చి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు క్రైమ్ డీసీపీ నాగన్న తెలిపారు.

సిబ్బందికి క్యాష్ రివార్డులు

నిందితుడిని సీసీ ఫుటేజీల ద్వారా గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకోవడంతో పాటు సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించిన సీఐ కె.దుర్గాప్రసాదరావు, కంచరపాలెం, గోపాలపట్నం, పెందుర్తి క్రైమ్ ఎస్‌ఐలు ఎన్.సునీల్, ఎస్.నరసింహరాజు, ఎం.డి.సల్మాన్ ఖాన్, క్రైమ్ కానిస్టేబుళ్లు పి.గణేష్, జీవీవీ కిశోర్, ఎన్.ఎస్.బి.నవీన్‌కుమార్, వై.శివకుమార్, పి.పైడిరాజు, వై.శివ, ఎస్.రవిబాబులకు క్రైమ్ డీసీపీ జి.నాగన్న క్యాష్ రివార్డులు ప్రదానం చేసి అభినందించారు.

ఇద్దరు వ్యవసాయ సహాయకుల సస్పెన్షన్

- తప్పుడు భూరికార్డులతో ఈ–క్రాప్ నమోదు
- సుమారు రూ.11.16 లక్షలు స్వాహా

టెక్కలి: తప్పుడు భూ రికార్డులతో ఈ–క్రాప్ నమోదు చేసి వాటికి వచ్చిన సుమారు రూ.11.16 లక్షలను కాజేసిన నందిగాం మండలానికి చెందిన ఇద్దరు వ్యవసాయ సహాయకులను సస్పెన్షన్ చేస్తూ వ్యవసాయ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దలవునిపల్లి రైతు భరోసా కేంద్రానికి చెందిన వ్యవసాయ సహాయకుడు పాలవలస నవీన్‌కుమార్ ఇదే మండలం బోరుభద్ర ఆర్‌బీకే వ్యవసాయ సహాయకుడు అనంతగిరి రాంబాబు లాగిన్‌ను ఉపయోగించుకుని తప్పుడు భూ రికార్డులతో వారికి అనుకూలంగా ఉన్న వారి పేర్లతో ఈ–క్రాప్ నమోదు చేశారు. దీనికి సంబంధించి కామదేనువు, కృష్ణరాయపురం గ్రామాల్లో భూములు ఉన్నట్లు నమోదు చేశారు. వీటికి సంబంధించి సుమారు రూ.11.16 లక్షల ఇన్సూరెన్స్ విడుదల కావడంతో ఆ సొమ్మును కాజేశారు. 2021 సంవత్సరానికి సంబంధించి ఇన్సూరెన్స్ జాబితాలో ఇదే ఆర్‌బీకేల పరిధిలో కొంతమంది రైతుల పేర్లు లేకపోవడంతో వ్యవసాయాధికారులు విచారణ చేయగా అసలు విషయం బయటపడిందని టెక్కలి వ్యవసాయ శాఖ ఏడీ బీ.వీ.తిరుమలరావు వెల్లడించారు. వ్యవసాయ సహాయకులు పాలవలస నవీన్ కుమార్, అనంతగిరి రాంబాబు ఇద్దరూ కలిసి ఈ–క్రాప్ నమోదులో అక్రమాలకు పాల్పడి ఇన్సూరెన్స్ డబ్బులను కాజేసినట్లు బహిర్గతం కావడంతో ఇరువురిని జేడీ సస్పెన్షన్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

డయాలసిస్ రోగులకు మెరుగైన సేవలు



రోగులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

సోంపేట: డయాలసిస్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోంపేట సామాజిక ఆస్పత్రి ఆవరణలో నిర్వహిస్తున్న డయాలసిస్ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. వైద్యులు, రోగులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజనీ సహకారంతో మరో రెండు యూనిట్లు సోంపేటకు తీసుకువచ్చామని విజయ తెలిపారు. వాటిని ప్రారంభించడానికి వైద్య సిబ్బంది కృషిచేయాలన్నారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు రానీయకుండా చూడాలన్నారు. అనంతరం సామాజిక ఆసుపత్రి పరిశీలించి రోగులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద, సర్పంచ్ నగిరి ప్రభావతి, సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ పి.దుర్యోదన, డాక్టర్ జగబంధు, వైఎస్సార్ సీపీ మండల కమిటీ అధ్యక్షుడు తడక జోగారావు, ఎంపీటీసీ పొడుగు కామేష్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో విజయదుర్గ



శ్రీకాకుళం నానుబాలవీధిలో విజయ దుర్గా అమ్మవారిని శుక్రవారం ప్రత్యేకంగా అలంకరించారు. ముందుగా అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

త్వరలోనే బలసలరేవు బ్రిడ్జి పనులు



రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: బలసల రేవు బ్రిడ్జి నిర్మాణంతో ఆమదాలవలస– సంతకవిటి మండలాల మధ్య రాకపోకలు సులభతరమవుతాయని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శుక్రవారం ఆమదాలవలస మున్సిపల్ కార్యాలయంలో ఆమదాలవలస, సంతకవిటి మండలాల రెవెన్యూ అధికారులు, ఆర్ అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నాగావళి నది పరివాహక సరిహద్దు గ్రామమైన వాల్తేరు పరిసర ప్రాంతాల్లో 6.67 ఎకరాల భూమిని గుర్తించామన్నారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ ఆమదాలవలస మండలం ఇసుకల పేట, సంతకవిటి మండలం వాల్తేరు గ్రామాల మధ్య నాగావళి నదీ పరివాహక ప్రాంతంలో బలసలరేవు వంతెన నిర్మాణానికి అన్ని అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. భూమి పరిశోధన పనులు కూడా ప్రారంభమయ్యాయన్నారు. రూ.87 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో అర్‌అండ్‌బీ అధికారులు, తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

కేజీబీవీలో పాము కలకలం



బాలిక నుంచి వివరాలు తెలుసుకుంటున్న జీసీడీఓ నీరజ

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో శుక్రవారం వేకువజామున పాము కలకలం రేపింది. టెక్కలి మండలం బొప్పాయిపురం గ్రామానికి చెందిన ఏడో తరగతి విద్యార్థిని తెలగవలస షర్మిల నిద్రపోతుండగా కాలుపై నుంచి పాము వెళ్లినట్లు అదే గదిలో ఉన్న మరో విద్యార్థిని పూర్ణిమ చూసింది. విషయాన్ని పాఠశాల ఏఎన్‌ఎం శశికర్లకు తెలియజేసింది. ఆమె వెంటనే లైట్లు వేసి చూడగా పాము కనిపించలేదు. విషయాన్ని ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరత్నం దృష్టికి తీసువెళ్లి పరిశీలించగా ఎక్కడా పాము కాటు వేసిన గాయాలు కనిపించలేదు. షర్మిల భయపడటంతో తలిదండ్రులకు తెలియజేసి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. కేజీబీవీ సీడీఓఓ ఎస్.నీరజ ఆస్పత్రికి వెళ్లి బాలిక నుంచి వివరాలు సేకరించారు. ఈ ఘటనపై శనివారం మరోసారి విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని జీసీడీఓ తెలిపారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



కంబైన్డ్ హార్వెస్టర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండలంలోని బైరి రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం కార్తికేయ క్లస్టర్ స్థాయి కంబైన్డ్ హార్వెస్టర్‌ను (వైఎస్సార్ యంత్రసేవ)ను జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులు యంత్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రుప్ప దివ్య, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిట్టి జనార్దనరావు, ఏడీఏ రజనీ, వ్యవసాయ అధికారి ఉషాకుమారి, డీసీసీబీ మేనేజర్ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి సాయం



సాయం అందిస్తున్న ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సభ్యులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బెండి గ్రామానికి చెందిన అల్లాడ మహాలక్ష్మి కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండటంతో 'కన్నీటి కథ' పేరిట ఇటీవల సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై పలువురు దాతలు స్పందించి బాధితురాలికి అండగా నిలిచారు. శుక్రవారం ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సభ్యులు బాధితరాలికు రూ.8వేలు ఆర్థిక సహాయం అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు చంటి, నరేష్, రాజేష్, జోగారావు, గోపాల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.